

**రైతు నోట్లో ఎర్రమట్టి!**

పంట పొలాల మధ్య మైనింగ్ తవ్వకాలు చేపట్టి కొందరు అక్రమార్కులు రైతుల కష్టాన్ని కాలరాస్తున్నారు. 10లో▸



**ఉపాధ్యాయుడు నిత్య..**

ఉపాధ్యాయులు నిత్యం కొత్త విషయాలు తెలుసుకోవాలని ఉపాధ్యాయ జిల్లా రిసోర్స్ పర్సన్ వీరేశం గౌడ్ అన్నారు. 10లో▸



**అవగాహన లేకపోతే ఆగం!**

ముందస్తు వర్షాలు కురుస్తుండడంతో మండలంలోని రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. 11లో▸

## న్యూస్‌రీల్

### ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**తాండూరు టౌన్:** తాండూరు పట్టణ శివారులోని తెలంగాణ రాష్ట్ర బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకుల ప్రిన్సిపాల్ ప్రవీణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురుకులంలోని ఉన్నత పాఠశాలలో తెలుగు, హిందీ, గణితం, సైన్స్, సోషల్ బోధించుటకు, కళాశాలలో గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ బోధించుటకు అర్హత గల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారాలను ఈనెల 30వ తేదీ సాయంత్రం 4 గంటల లోగా గురుకులంలో అందజేయాలని కోరారు.

### జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

**యాలాల:** రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్, మార్కెటింగ్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 29న నిర్వహించనున్న జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని యువజన కాంగ్రెస్ యాలాల మండల అధ్యక్షుడు వీరేశం ముదిరాజ్ శుక్రవారం కోరారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నేతృత్వంలో పట్టణంలోని వినాయక కన్వెన్షన్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాబ్‌మేళా ఉంటుందన్నారు. 18 ఏళ్ల నుంచి 55 ఏళ్ల లోపు యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### సైన్స్‌పై ఆసక్తి కలిగేలా బోధన సాగాలి

జిల్లా విద్యాధికారి రేణుకాదేవి



ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఈఓ రేణుకాదేవి

**పూడూరు:** శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తూ విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తి కలిగేలా బోధన చేయాలని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మండలంలోని ఎన్కేపల్లి తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఘన ప్రదార్థాలలో ధ్వని ప్రసరణ వేగవంతం జరుగుతుందనే ప్రయోగాన్ని వివరించారు. సెల్‌ఫోన్‌లో కాన్ఫరెన్స్ కాల్ ఎలా మాట్లాడుతున్నామనే దాన్ని ప్రయోగాత్మకంగా చూపించారు. కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్ రవికుమార్ నాయక్, లాలయ్య, అకాడమిక్ మానిటరింగ్ అధికారి రామ్‌మస్తాన్, సెక్టోరియల్ అధికారి రమేష్, జిల్లా సైన్స్ అధికారి విశ్వేశ్వర్, రిసోర్సు పర్సన్లు రాందాస్, బాల్‌రాజ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### క్షయ వ్యాధిని కట్టడి చేద్దాం

టీబీ ప్రోగ్రామ్ ఆఫీసర్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవీంద్రయాదవ్



కొడంగల్ రూరల్: మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవీంద్రయాదవ్

**కొడంగల్ రూరల్:** క్షయ వ్యాధి నిర్ధారణ అయిన వ్యక్తులు క్రమం తప్పకుండా మందులు వాడుతూ కట్టడికి కృషి చేయాలని టీబీ ప్రోగ్రామ్ ఆఫీసర్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవీంద్రయాదవ్ సూచించారు. శుక్రవారం మండలంలోని రుద్రారం గ్రామ రైతు వేదికలో అంగడిరాయిచూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో టీబీ అనుమానితులతోపాటు, డయాలసిస్, షుగర్, బీపీ, హెచ్‌ఐవీ తదితర వ్యాధులకు సంబంధించి 120మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 41మందిని కొడంగల్ ఆస్పత్రికి పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి దగ్గు ఉన్నా, సాయంత్రం సమయంలో జ్వరం వచ్చినా, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, ఛాతిలో నొప్పి తదితర లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వాస్పత్రిలో పరీక్షలు చేయించుకోవాలని సూచిచారు.

**అవగాహన అవసరం**

**దోమ:** టీబీ వ్యాధిపై ప్రజలకు అవగాహన ఉండాలని జిల్లా టీబీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రవీంద్ర యాదవ్ అన్నారు. శుక్రవారం దోమ మండల కేంద్రంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా సీహెచ్‌ఓ విజయలక్ష్మి, పల్లె దవాఖాన మెడికల్ ఆఫీసర్ అఖిల్‌తో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ ప్రభులింగం, డీపీఓ హైదర్ అలీ, ఎస్టీఎల్‌ఎస్ నవీన్‌గౌడ్, రాజు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

# రుణం అరకొరే!



**గత ఏడాది క్రాప్ లోన్ లక్ష్యం రూ.3,547 కోట్లు**

- ఇచ్చింది రూ.2,014 కోట్లే..
- నామమాత్రపు రుణాలతో సరిపెడుతున్న బ్యాంకర్లు
- రైతు భరోసా కూడా అంతంతే..
- వడ్డీ వ్యాపారుల గడప తొక్కి అప్పులపాలైన అన్నదాతలు

**వికారాబాద్:** ఏటా పంట రుణాల మంజూరులో బ్యాంకర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. యాసంగి సీజన్ ముగుస్తున్నా టార్గెట్‌లో 60 శాతం రుణాలు కూడా ఇవ్వలేదు. ఇతర రుణాల విషయంలో వందశాతం పూర్తి చేస్తున్న బ్యాంకర్లు అన్నదాతల విషయంలో సవతి తల్లి ప్రేమ చూపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గత ఖరీఫ్ సీజన్‌లో కూడా ఇదే పంథా కొనసాగించారు. జిల్లాలో నిర్దేశించుకున్న రుణ లక్ష్యాన్ని చేరుకోలేకపోయారు. పంట రుణాల మంజూరులో బ్యాంకర్లు అలసత్వం వీడటంలేదు. రైతు భరోసా పథకం కింద ఏటా రెండు సార్లు ఎకరాకు రూ.6 వేల చొప్పున రూ.12 వేలు అందజేయాల్సి ఉండగా గత ఏడాది ఒక్కసారి మాత్రమే అందజేశారు. ఈ ప్రక్రియ సైతం పూర్తి స్థాయిలో అమలు కాలేదు. పంట పెట్టుబడి కోసం రైతులు బ్యాంకుల చుట్టూ తిరిగినా పెద్దగా ఫలితం కనిపించలేదు. దీంతో చాలా మంది వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి నష్టపోయారు.

**ఈ సారైనా లక్ష్యం పూర్తి చేస్తారా?**

జిల్లాలో మొత్తం 3.12 లక్షల మంది రైతులు.. 5.88లక్షల ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఖరీఫ్ సీజన్‌లో ఐదు లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తారు. రబీలో 1.5లక్షల ఎకరాల్లో ఆయా పంటలు వేస్తారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌కు రైతులు సిద్ధమవుతున్నారు. అయితే రైతులు బ్యాంకర్ల నుంచి రుణాలు అందుతాయా లేదా అనే ఆలోచనలో పడ్డారు. గత ఏడాది క్రాప్ లోన్ అందక వడ్డీ వ్యాపారులను ఆశ్రయించామని, ఈ సారి కూడా అదే పరిస్థితి రావచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆయా పంటల రకాలను బట్టి ఒక్కో పంట సాగుకు ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి అవుతుంది. కానీ సాగు సాయం పేరుతో ఎకరాకు రూ.6 వేలు కూడా ఇవ్వడం లేదని రైతులు అంటున్నారు.

**1,86,107 మంది రైతులకు ఖాతాలు**

గృహ, వాహణ, వ్యక్తిగత రుణాల విషయంలో లక్ష్యానికి మించి ఇచ్చే బ్యాంకర్లు పంట రుణాల విషయంలో టార్గెట్ చేరుకోవడంలేదు. ఇచ్చిది అరాకొరా అయినా సకాలంలో ఇవ్వడంలేదు. జిల్లాలో మొత్తం 3.12 లక్షల మంది రైతులు ఉన్నారు. 1,86,107 మంది అన్నదాతలకు ఆయా బ్యాంకుల్లో ఖాతాలు ఉన్నాయి. గడిచిన వ్యవసాయ సీజన్‌లో ఆయా బ్యాంకుల ద్వారా రూ.3,547 కోట్లు వ్యవసాయ రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సీజన్ ముగిసినా(ఖరీఫ్, రబీని కలుపుకొని) రూ.2,014 కోట్లు అంటే 60శాతం లోపే రుణాలు ఇచ్చారు. దీర్ఘకాలిక రుణాల విషయంలో మరింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

**పెండింగ్‌లోనే..**

జిల్లాలో రైతు భరోసాకు అర్హులైన వారు 3,12,872 మంది ఉన్నారు. వీరికి 6,03,500 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. నాలుగు ఎకరాల వరకు భూమి ఉన్న రైతులు 2,26,253 మంది ఉన్నారు. ఎకరాకు రూ.6 వేల చొప్పున రూ.212.52 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. మరో 2.5లక్షల మందికి రూ.149.57 కోట్లు జమ చేయాల్సి ఉంది. అయితే వ్యవసాయ శాఖ జిల్లా అధికారులు 2,69,293 మందికి సంబంధించి రూ.332.76 కోట్లు బిల్లులు రెడీ చేసి ట్రెజరీకి పంపారు. కానీ రూ.120 కోట్లు రైతుల ఖాతాల్లో పడలేదు. ఎందుకు పెండింగ్‌లో ఉంచారో తెలియడం లేదు.

| |
|---|
| జిల్లాలో సాగు విస్తీర్ణం 5.88లక్షల ఎకరాలు |
| మొత్తం రైతులు 3.12లక్షల మంది |
| ఏటా జూన్ నుంచి మే చివరి వరకు పంట రుణాల ప్రణాళిక |
| ఖరీఫ్ సాయం కోసం అన్నదాతల ఎదురుచూపులు |

**టార్గెట్ చేరుకునేలా కృషి చేస్తాం**

గత ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో ఎంచుకున్న లక్ష్యం పూర్తి కాని మాట వాస్తవమే. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున సకాలంలో రుణాలు అందేలా చూస్తాం. బ్యాంకర్లతో సమావేశం నిర్వహించి రుణ ప్రణాళిక సిద్ధం చేశాం. సకాలంలో రుణాలివ్వాలని కలెక్టర్‌కు కూడా బ్యాంకర్లకు సూచించారు. ఈసారి టార్గెట్ చేరుకునేలా కృషి చేస్తాం

– యాదగిరి, లీడ్ బ్యాంక్ మేనేజర్, వికారాబాద్



మన్నెగూడలో మామిడి పండ్ల దుకాణం

# మా'మిడి'!

- ఈసారి భారీగా తగ్గిన పండ్ల దిగుబడి
- అరకొరగా కాసిన తోటలు
- ముంచిన అకాల వర్షాలు, ఈదురు గాలులు

**పూడూరు:** ఈ ఏడాది మామిడి దిగుబడి గణనీయంగా తగ్గింది. గతంతో పోలిస్తే 25శాతం చెట్లు మాత్రమే కాపు కాసాయి. దీనికితోడు వరుస అకాల వర్షాలు, వడగళ్లు, ఈదురు గాలులతో తోటలు బాగా దెబ్బతిన్నాయి. దీంతో పండ్ల ధరలు భారీగా పెరిగాయి.

**నోరూరిస్తున్న ఫలాలు**

మార్కెట్లో విక్రయానికి పెట్టిన మామిడి పండ్లు నోరూరిస్తున్నాయి. మండల పరిధిలోని మన్నెగూడ ప్రాంతం మామిడి పండ్లకు ప్రసిద్ధి గాంచింది. పూడూరు, ఎన్కేపల్లి, మన్నెగూడ, గొంగుపల్లి,బాకాపూర్,మీర్జాపూర్ తదితర గ్రామాల్లోని వేలాది ఎకరాల్లో ఈ తోటలు సాగవుతున్నాయి.వీటిలో దశేరి, చిన్నరసాలు, పెద్దరసాలు, బేనిషాన్,మల్గోబా,బంగిన్‌పల్లి,తోతాపరి, లంగ్డా, సఫేదా తదితర రకాలున్నాయి. ఈ ప్రాంతంలో కాచే మామిడికి వికారాబాద్ మహమూదా అని పేరు పెట్టారు.గతంలో కాయలు కోసం కార్బైడ్ వేసి మాగు వేసే వారు. ప్రభుత్వం దీన్ని నిషేధించడంతో తక్కువ మోతాదులో ఉన్న రసాయనాలతో సహజసిద్ధమైన పండ్లను విక్రయిస్తున్నారు. ఆయా రకాలను బట్టి కిలోకు రూ.80 నుంచి రూ.180 వరకు విక్రయిస్తున్నారు. తాజాగా, ప్రకృతిసిద్ధంగా దొరికే పండ్లు కావడంతో వినియోగదారులు ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు.

**దారి పొడవునా దుకాణాలే..**

మధుర ఫలంగా పేరున్న మామిడిని తినేందుకు అన్ని వయసుల వారు ఆసక్తి చూపుతారు. ఈక్రమంలో మన్నెగూడ సమీపంలోని హైదరాబాద్– బీజాపూర్ హైవే పక్కన దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. జిల్లా ప్రజలతో పాటు ఈ మార్గం మీదుగా రాకపోకలు సాగించే వారు ఎక్కువగా కొనుగోలు చేస్తుంటారు. స్థానిక తోటల్లోని దిగుబడులు మహబూబ్‌నగర్, మెదక్, హైదరాబాద్ జిల్లాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, దుబాయ్ వంటి ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు.

**దిగుబడి లేదు**

ఈసీజన్‌లో చాలా తోటలకు పూత, కాత రాలేదు. లక్షల రూపాయలు పెట్టి తోటలు కొనుగోలు చేశాం. ఈదురు గాలులకు తీవ్రంగా నష్టపోయాం. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. ఇక్కడ సహజసిద్ధమైన పండ్లను విక్రయిస్తున్నాం.

– రహీస్, మామిడి పండ్ల వ్యాపారి



సమావేశంలో మాట్లాడుతున్న సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్

# పేదరిక నిర్మూలనకు కృషి

- తెలంగాణ సమ్మిళిత జీవనోపాధిని జయప్రదం చేయాలి
- సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్

**కొడంగల్:** తెలంగాణ సమ్మిళిత జీవనోపాధుల కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాల పాత్రపై సభ్యులకు పేదరిక నిర్మూలనపై అవగాహన కల్పించాలని, అందుకు తగినట్లు కార్యాచరణ రూపొందిస్తూ అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలని రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ ముఖ్య కార్యదర్శి(సెర్ప్ సీఈఓ) దివ్య దేవరాజన్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని కడా కార్యాలయంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, కడా ప్రత్యేకాధికారి వెంకట్ రెడ్డి, సబ్ కలెక్టర్ ఉమాశంకర్, అడిషనల్ కలెక్టర్ సుధీర్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జానకి, మండల మహిళా సమాఖ్య, వికారాబాద్ మహిళా సమాఖ్య సభ్యుల సమావేశంలో మాట్లాడారు. గ్రామ ఐక్య సంఘాల ఆధ్వర్యంలో సీఆర్పీల సహకారంతో పేదరికంలో ఉన్నవారిని గుర్తిస్తూ వారికి సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. ముఖ్యమంత్రి నియోజకవర్గంలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని శాఖల ముఖ్య అధికారులతో సమావేశం నిర్వహిస్తూ సమ్మిళిత జీవనోపాధుల కార్యక్రమాన్ని వివరించారు. ఇందులో ఎంపిక చేసే అత్యంత పేదరికం కుటుంబాలకు ఆయా శాఖల నుంచి పూర్తి సహాయ సహకారాలు అందించాలని సూచించారు. శాఖల అధికారులకు సెర్ప్ ఆధ్వర్యంలో పూర్తి సహకారాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం అంగడిరాయిచూర్ గ్రామంలో మహిళా శక్తి కుట్టు కేంద్రంను కలెక్టర్ ప్రతీక్‌జైన్, వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్, సెర్ప్ సీఓఓ రజిత, టీజీఐఎల్‌పీ రాష్ట్ర ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ జయరాం, రవీందర్‌రావు, సెర్ప్ డీపీఎం రామ్మూర్తి, శ్రీనివాస్, ఆర్‌ఎం ఉదయకుమారి తదితరులు పాల్గొన్నారు.

# అటవీ భూమి ఆక్రమణ!

**చెట్లు నరికి మట్టి రోడ్డు ఏర్పాటు**

- వారం రోజుల క్రితం డీఎఫ్‌ఓకు ఫిర్యాదు
- ఆలస్యంగా వెలుగులోకి..

**బొంరాస్‌పేట:** ఒక చెట్టు ఒక మనిషితో సమానం అని చెప్పే అటవీశాఖ అధికారులు చెట్లను నరికి అడవిని కబ్జా చేస్తున్నా పట్టించుకోవడంలేదు. అటవీ భూమి ఆక్రమణపై కొంత మంది రైతులు డీఎఫ్‌ఓకు ఫిర్యాదు చేసిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బొంరాస్‌పేట మండలం ఎన్కేపల్లి, రేగడిమైలారం, వడిచర్ల గ్రామాల శివారులో రెవెన్యూ రికార్డుల ప్రకారం తిర్మలాపూర్ అనే గ్రామం ఉంది. ఇక్కడ చాలా కాలం నుంచి జన సంచారం లేకపోవడంతో అటవీప్రాంతంగా మారిపోయింది. గతంలో టెనెంట్ పట్టా కింద గ్రామ శివారులో ఎన్కేపల్లికి చెందిన పూజారి కుటుంబానికి చెందిన పలువురు దాయాదులకు సర్వే నం.13, 15, 19లో పట్టా భూమి ఉంది. అందులో వీఎస్ఎస్ మాజీ చైర్మన్, ప్రస్తుత ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పూజారి నర్సింలుకు సైతం 4.9ఎకరాల భూమి ఉంది. దీనికి సమీపంలోని అటవీ భూమిని కబ్జా చేస్తూ వచ్చాడు. అడవిలోని ఆలయాలకు మట్టి రోడ్డు వేస్తున్నట్లు అక్కడి రైతులను నమ్మించాడు. అనంతరం తన పొలానికి.. ఆక్రమించిన అటవీ భూమిలో మట్టి రోడ్డు వేశాడు. అక్కడి నుంచి తిర్మలాపూర్ శివారులోని అటవీప్రాంతం(ఆర్ఎఫ్)లోకి ప్రవేశించి జేసీబీతో ట్రెంచింగ్‌ను పూడ్చివేసి, మట్టిని తవ్వి, చెట్లను నరికి రోడ్డు ఏర్పాటు పనులు చేపట్టాడు. ఇందు కోసం దాదాపు 200ల చెట్లను నరికేసినట్లు సమాచారం. 20 లారీల మట్టి తవ్వి సుమారు అర కిలోమీటరు మేర మట్టి రోడ్డు వేశాడు. తన పొలం పక్కన ఉన్న నాలుగు ఎకరాల అటవీ భూమిని కబ్జా చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయం ఫారెస్ట్ అధికారుల దృష్టికి వెళ్లడంతో నర్సింలుపై నష్టపరిహారంతోపాటు కేసు నమోదు చేసినట్లు తెలిసింది. అటవీ భూమిని ఆక్రమించి రోడ్డు వేసిన వ్యక్తిపై చర్యలు తీసుకుంటామని ఎఫ్ఆర్‌ఓ సవిత తెలిపారు. అటవీ భూమిని స్వాధీనం చేసుకోవడంతో పాటు మట్టిరోడ్డును తొలగిస్తామని అన్నారు.



ఆక్రమిత భూమిని పరిశీలిస్తున్న రాష్ట్రస్థాయి అధికారుల బృందం



అటవీ ప్రాంతంలో వేసిన మట్టిరోడ్డు

**ఫ్లయింగ్ స్క్వాడ్ పరిశీలన**

అటవీ భూమి కబ్జా, మట్టి రోడ్డు ఏర్పాటుపై ఈనెల 15న కొంత మంది రైతులు డీఎఫ్‌ఓ జ్ఞానేశ్వర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఇప్పటివరకు స్పందన కనిపించలేదు. ఈ విషయం అటవీశాఖ ఉన్నత స్థాయి అధికారులకు తెలియడంతో శుక్రవారం ఫ్లయింగ్ స్క్వాడ్ కబ్జాకు గురైన భూమిని పరిశీలించేందుకు వచ్చింది.

**కఠిన చర్యలు తప్పవు**



అటవీ భూమిని ఆక్రమించడం, మట్టి రోడ్డు వేయడం వాస్తవం. ఇది చట్టరీత్యా నేరం. దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నాం. ఇప్పటికే సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశాం. జరిమానా విధించడం తోపాటు అడవికి జరిగిన నష్టాన్ని అంచనా వేసి ఆ ప్రాంతంలో అభివృద్ధి పనులు చేయిస్తాం. కబ్జాకు గురైన భూమిని స్వాధీనం చేసుకుంటాం.

– జ్ఞానేశ్వర్, డీఎఫ్‌ఓ

# బస్తాకు 41 కిలోలే ఫైనల్

- ఎక్కువ ధాన్యం తూకం వేస్తే కఠిన చర్యలు
- అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్



కాశీంపూర్ కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

**సాక్షి ఎఫెక్ట్..**

**బషీరాబాద్:** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో బస్తాకు 41 కిలోలే వడ్లు తూకం వేయాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ నిర్వాహకులను ఆదేశించారు. అంతకంటే ఎక్కువ తూకం వేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శుక్రవారం సాక్షి దినపత్రికలో మిల్లర్ల మాయాజాలం.. ధాన్యం కొనుగోళ్లలో దోపిడీ శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. మండలంలోని కాశీంపూర్, మైల్వార్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. తాలు సాకుతో ఒక్కో బస్తాకు 42 నుంచి 42.50 కిలోలు ధాన్యం తూకం ఎందుకు వేశారని కేంద్రం నిర్వాహకులను ప్రశ్నించారు. వాస్తవానికి ఒక్కో బస్తాకు 40.650కిలోలే తీసుకోవాలని ఆదేశించారు. ఒకవేళ ఎక్కడైన తాలు ఉంటే బస్తాకు 41కిలోలు తూకం వేయాలని సూచించారు. మిల్లర్లు చెప్పారని 42 కిలోలపైన తూకం వేయడంపై ఐకేపీ, పీఏసీఎస్ సిబ్బందిపై మండిపడ్డారు. ఇక నుంచి ధాన్యం శుభ్రపరచడానికి జిల్లాకు 50 ప్యాడీ క్లీనర్ యంత్రాలు వచ్చినట్లు వివరించారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలకు 24లక్షల గన్నీ బ్యాగులు సరఫరా చేసినట్లు పేర్కొన్నారు. సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు అదనంగా 25లారీలు కేటాయించినట్లు చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు 45వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బషీరాబాద్ డీటీ రుక్సానా బేగం, ఏపీఎం పద్మారావు పాల్గొన్నారు. అంతకు ముందు జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జానకీ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు.

# గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

- కలెక్టర్ ప్రతీక్ జైన్

**దౌల్తాబాద్:** గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, వాటిని సద్వినియోగం చేసుకొని ఉన్నతశిఖరాలు చేరుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ యువతకు సూచించారు. మండల కేంద్రంలో రూ.68 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని శుక్రవారం రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దౌల్తాబాద్‌లో అత్యాధునిక సదుపాయాలతో నూతన భవనాన్ని నిర్మించామని తెలిపారు. ఇక్కడ చిన్న పిల్లలకు, నిరుద్యోగ యువతకు, అన్ని వర్గాల వారికి పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పిల్లలకు ఆట వస్తువులు, కంప్యూటర్లు ఉన్నట్లు తెలిపారు. సంస్థ ప్రతినిధులు కంప్యూటర్‌పై శిక్షణ ఇస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని యువకులు, పిల్లలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వికారాబాద్, నారాయణపేట జిల్లాల చైర్మన్లు రాజేశ్‌రెడ్డి, వార్ల విజయ్‌కుమార్, తహసీల్దార్ గాయత్రి, ఎంపీడీఓ శ్రీనివాస్, నాయకులు వెంకట్రావు, వీరన్న, వెంకట్‌రెడ్డి, విజయ్‌కుమార్, ప్రమోద్‌రావు, రెడ్డి శ్రీను రాజశేఖర్ రెడ్డి, రాజు, నర్సప్ప, తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయ నూతన భవనాన్ని ప్రారంభించి పూజ చేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్ తదితరులు

## క్లుప్తంగా

### మొక్కల ఎదుగుదలను గమనించండి

**ఎంపీడీఓ విజయలక్ష్మి**

**మోమిన్‌పేట:** నర్సరీల్లో మొక్కల ఎదుగుదలను గమనించాలని ఎంపీడీఓ విజయలక్ష్మి సూచించారు. శుక్రవారం ఆమె మండల పరిధిలోని దుర్గంచెర్వులో పర్యటించారు. వర్షాలు కురిసిన వెంటనే మొక్కలు నాటాల్సిన అవసరం ఉంటుందని.. నర్సరీల్లోని మొక్కల్లో ఎదుగుదల కనిపించడం లేదన్నారు. అనంతరం పంచాయతీల్లో రిజిస్టర్లను పరిశీలించారు. రికార్డులు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని చెప్పారు.

### చికిత్స పొందుతున్న యువకుడి మృతి

**కుల్కచర్ల:** చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందిన సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ రమేష్ తెలిపిన ప్రకారం.. పుట్టపహాడ్ గ్రామానికి చెందిన హరివర్ధన్(18) మంగళవారం రాత్రి పుట్టపహాడ్ శివారులో ఆగిఉన్న లారీని ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డారు. చికిత్సపొందుతున్న యువకుడు శుక్రవారం మృతిచెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

### సెల్‌ఫోన్ రికవరీ



బాధితుడికి సెల్ ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ రమేశ్

**కుల్కచర్ల:** సీఈఐఆర్(సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) సహకారంతో దొంగిలించబడిన సెల్‌ఫోన్‌ను రికవరీ చేయవచ్చునని కుల్కచర్ల ఎస్ఐ రమేష్ అన్నారు. గ్రామానికి చెందిన చాకలి మహేశ్ వద్ద గతేడాది జూన్ 1న ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట గుర్తు తెలియని దొంగ సెల్‌ఫోన్ చోరీ చేశారు. దీంతో పోలీసులు సీఈఐఆర్ విధానంలో ఫోన్‌ను గుర్తించారు. శుక్రవారం బాధితుడికి ఫోన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ రఘు తదితరులు పాల్గొన్నారు.

### మావోయిస్టులపై కేంద్రం తీరు సరికాదు

**పరిగి:** మావోయిస్టుల విషయంలో కేంద్ర ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవహరిస్తోందని సీపీఐ డివిజన్ కార్యదర్శి పీర్‌మహ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంతో చర్చలకు తాము సిద్ధంగా ఉన్నట్లు మావోయిస్టులు ప్రకటించినప్పటికీ అక్కడి సీఎం కావాలనే ఎన్‌కౌంటర్ పేరిట అమానుషంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మనుషుల ప్రాణాలను తీసే విధానాలను విజయంగా చూసే పార్టీలను గతంలో ఎప్పుడూ చూడలేదని పేర్కొన్నారు. సాయుధ బలగాలను వెనక్కి రప్పించి, మావోయిస్టులను చర్చలకు ఆహ్వానించాలని కోరారు.

### రావి ఆకుపై 'కాలకేయుడు'



రావిఆకుపై ప్రభాకర్ చిత్రం

**దౌల్తాబాద్:** మండలంలోని యాంకి గ్రామానికి చెందిన చిత్రకళాకారుడు సున్నపు అశోక్ రావి ఆకుపై సినీనటుడు కాలకేయ ప్రభాకర్ చిత్రాన్ని రూపొందించారు. శుక్రవారం నగరంలోని ప్రభాకర్ ఇంటికి వెళ్లి ఆయనకు బహూకరించారు.

# రైతు నోట్లో ఎర్రమట్టి!

మైనింగ్ తవ్వకాల నుంచి వస్తున్న దుమ్ము ప్రభావం పంటలపై పడుతోంది. లక్షలు పెట్టుబడి పెట్టి సాగు చేసినా పంటలు చేతికి అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఎదగలేక ఎండిపోతున్న పైర్లు**

- అనుమతులకు మించి తవ్వకాలు
- పట్టించుకోని మైనింగ్, రెవెన్యూ అధికారులు



పంటపొలాల మధ్య ఎర్రమట్టి తవ్వకాలు

**పూడూరు:** పంట పొలాల మధ్య మైనింగ్ తవ్వకాలు చేపట్టి రైతుల కష్టాన్ని కాలరాస్తున్నారు. కొందరు అక్రమార్కులు మైనింగ్ అధికారులతో చేతులు కలిపి లాటరైట్(ఎర్రమట్టి)ను తరలిస్తూ కోట్లు గడిస్తున్నారు. లాటరైట్‌ను సిమెంట్ తయారీలో ముడి పదార్థంగా వాడడంతో రాత్రిళ్లు గుట్టు చప్పుడు కాకుండా ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారు. విషయం తెలిసినా మైనింగ్, రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల పరిధిలోని మీర్జాపూర్‌లో పంట పొలాల మధ్య తవ్వకాలు చేపట్టడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తక్కువ మొత్తంలో అనుమతులు తీసుకుని చుట్టూ ఉన్న భూమిలోనూ మట్టి తవ్వకాలు చేపట్టి సిమెంట్ ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. పొలాల మధ్య లోతైన గుంతలు తవ్వడంతో భూగర్భజాలు తగ్గి బోర్లలో నీరు రావడం లేదని పరిసర ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలపై ఎర్రమట్టి దుమ్ము పడి పంటలు దెబ్బతింటున్నాయి. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**వ్యవసాయమే జీవనాధారం**



తమకు వ్యవసాయమే జీవనాధారం. పొలాల మధ్య మైనింగ్, రసాయనాల ఫ్యాక్టరీలతో ఇబ్బందులు పడుతున్నాం. లారీల్లో మట్టి తరలిస్తున్న సమయంలో దుమ్ము పంటలపై పడి పాడవుతున్నాయి. పెట్టుబడులు వచ్చే పరిస్థితి కూడా లేదు.

– అబ్దుల్ వాహబ్, రైతు

**ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదు**



మైనింగ్ త్రవ్వకాలతో ఇబ్బందులు పడుతున్నామని జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. వరి, మొక్కజొన్న చామంతి పంటలు వేసుకున్నాం. ఎర్రమట్టి పడి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. రైతులందరం కలిసి తహసీల్దార్ కార్యాలయంతో పాటు కలెక్టర్ కార్యాలయంలోనూ ఫిర్యాదు చేశాం. ఎవరూ పట్టించుకోవడం లేదు.

– తెలుగు సురేశ్

**చర్యలు తీసుకుంటాం**

ఎర్రమట్టి తరలించడం కారణంగా పంటలు పాడవుతున్నాయని రైతులు ఫిర్యాదు చేశారు. సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం ఇచ్చారు. పంట పొలాల మధ్య నుంచి లారీలు వెళ్తున్న క్రమంలో దుమ్ము రాకుండా నీరు పోస్తామని మైనింగ్ యాజమాన్యం తెలిపారు. సమస్య పరిష్కారించేలా చర్యలు తీసుకుంటాం.

– భరత్‌గౌడ్, తహసీల్దార్, పూడూరు

## విద్యుత్ అధికారులకు కొత్త ఫోన్ నంబర్లు

**బషీరాబాద్:** మండలంలోని విద్యుత్ అధికారులకు ఆ శాఖ కొత్త ఫోన్ నంబర్లు కేటాయించిందని విద్యుత్ శాఖ ఏఈ అరవింద్ సూచించారు. బీఎస్ఎన్ఎల్ నంబర్లకు నెట్‌వర్క్ సమస్యలుండడంతో కొత్త నెట్‌వర్క్ నుంచి నంబర్లను కేటాయించారు. విద్యుత్ సమస్యలు వస్తే క్రింది నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. మండల సబ్ ఇంజినీర్ (ఇన్‌చార్జి ఏఈ) అరవింద్ 8712469752 నంబర్లో అందుబాటులో ఉంటారని చెప్పారు.

**బషీరాబాద్ లైన్‌మెన్ల నంబర్లు**

| | |
|---|---|
| రాజు | 90005 33617 |
| ఉమేష్ | 77990 35543 |
| రోహిత్ | 72075 20691 |
| గోవింద్ | 81796 47753 |
| అనిల్ | 88867 75802 |
| తిప్పన్న | 99514 97819 |

**కొడంగల్ సబ్ డివిజన్ పరిధిలో..**

| | |
|---|---|
| తాండూరు డీఈ | 87124 69718 |
| కొడంగల్ ఏడీఈ | 87124 69726 |
| కొడంగల్ ఏఈ | 87124 69757 |
| దౌల్తాబాద్ ఏఈ | 87124 69758 |
| దుద్యాల ఏఈ | 87124 69753 |
| బొంరాస్‌పేట ఏఈ | 87124 69756 |

**ధారూరు సబ్ స్టేషన్ పరిధిలో..**

**ధారూరు:** మండల పరిధిలో పనిచేస్తున్న ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది, సబ్‌స్టేషన్ల ఫోన్ నంబర్లు మారాయని మండల ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఏఈ ప్రమోద్‌సింగ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

| | |
|---|---|
| ట్రాన్స్‌కో ఏఈ | 87124 69741 |
| ఫోర్‌మెన్ మదుసూధన్ | 87124 69781 |
| ధారూరు సబ్‌స్టేషన్ | 87124 69805 |
| నాగారం సబ్‌స్టేషన్ | 87124 69799 |
| నాగసమందర్ సబ్‌స్టేషన్ | 87124 69816 |



ఓ రైతు పొలంలోని బోరును పరిశీలిస్తున్న అధికారులు

# నష్టం అంచనాకు సర్వే

- పారిశ్రామికవాడ కోసం రైతులు ఇచ్చిన పొలాల్లో పర్యటించిన అధికారులు
- వ్యవసాయ బోర్లు, పశువుల పాకలు, చెట్లు, ఫామ్ హౌస్‌ల లెక్కింపు
- ప్రత్యేక పరిహారం అందిస్తాం: తహసీల్దార్ కిషన్
- పర్యవేక్షించిన పరిగి డీఎస్పీ శ్రీనివాస్

**దుద్యాల్:** పారిశ్రామికవాడకు భూములు ఇచ్చి న రైతుల పొలాల్లో శుక్రవారం అధికారులు పర్యటించారు. దుద్యాల్ మండలం హకీంపేట్, లగచర్ల, పులిచర్లకుంట తండాల్లో సర్వే నిర్వహించారు. రైతులు ప్రభుత్వానికి ఇచ్చిన పొలాల్లోని వ్యవసాయ బోర్లు, పశువుల పాకలు, ఇళ్లు, విలువైన చెట్లను పరిశీలించారు. ఆయా గ్రామాలకు చెందిన 140 మంది రైతుల పొలాల్లో పైపేర్కొన్న వాటికి విలువ కట్టారు. ఆర్అండ్‌బీ అధికారులు పొలాల్లోని ఇళ్లు, ఫామ్ హౌస్‌ల విలువను అంచనా వేశారు. హార్టి, సిరి కల్చర్ అధికారులు పండ్ల తోటల ను, అటవీ శాఖ అధికారులు పెద్ద పెద్ద చెట్లను, ఎక్సైజ్ అధికారులు ఈత చెట్లను, భూగర్భ జల వనరుల శాఖ అధికారులు బోర్ల విలువ ను అంచనా వేశారు. ఈ ప్రక్రియ రెండు రోజు ల పాటు సాగుతుందని తహసీల్దార్ కిషన్ తెలి పారు. ప్రక్రియ పూర్తికాగానే ఏ రైతు పొలంలో ఏ మేరకు నష్టం జరుగుతుందని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతామని, అనంతరం పరిహారం మంజూరవుతుందని తెలిపారు. పది రోజుల క్రితం హకీంపేట్ గ్రామా నికి చెందిన కొంత మంది రైతులకు ఈ తరహా పరిహారం అందజేసినట్లు ఆయన తెలిపారు.

**పోలీసు బందోబస్తు మధ్య..**

లగచర్ల ఘటన నేపథ్యంలో హకీంపేట్, లగచర్ల, పులిచర్లకుంట తండాల్లో పోలీసు బందోబస్తు మధ్య సర్వే నిర్వహించారు. సర్వే అధికారికి ఒక ఎస్ఐ, కొంత మంది పోలీసులను కేటాయించారు. ఇలా గ్రూపులుగా ఏర్పడి సర్వే చేస్తున్నారు. ఈ ప్రక్రియను పరిగి డీఎస్పీ శ్రీనివాస్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి, కొడంగల్ ఎక్సైజ్ సీఐ వెంకటేశ్వరులు, దుద్యాల్, కొడంగల్, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్ ఎస్ఐలు యాదగిరి, సత్యనారాయణ, రహూఫ్, రవిగౌడ్, కానిస్టేబుళ్లు, ప్రత్యేక పోలీసులు,మహిళా పోలీసులు, ఆర్ఐ నవీన్ కుమార్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు పద్యంతో సృజనాత్మకత



అనంతగిరి: సమావేశంలో మాట్లాడుతున్న అంజయ్య

**ప్రముఖ సాహితీవేత్త మలుగ అంజయ్య**

**అనంతగిరి:** తెలుగు పద్యం విద్యార్థులకు ఏకాగ్రత, సృజనాత్మకతను పెంచుతుందని ప్రముఖ శతావధాని, సాహితీవేత్త డాక్టర్ మలుగ అంజయ్య అన్నారు. వికారాబాద్‌లోని డైట్ కళాశాలలో తెలుగు భాషోపాధ్యాయుల శిక్షణ కేంద్రంలో పద్య వైభవం అనే అంశంపై శుక్రవారం ఆయన విస్తృత ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలుగు పద్యం క్రీ.శ 6వ శతాబ్దం నుంచి ఉన్నదని, నన్నయ కాలం మహాభారతం తరువాత లయబద్ధమైన పద్యం వచ్చిందన్నారు. పద్యంలో కావ్యాలు, శతకాలు, ఖండ కావ్యాలు, రామాయణ, భారత భాగవతాలు తెలుగు భాషలో వచ్చాయన్నారు. విద్యార్థులలో సృజనాత్మకత పెంచడానికి పద్యం ఉపయోగపడుతుందన్నారు. ఒకనాటి కవులు సాహితీ లోకంలో పద్యమే ప్రాణంగా భావించారన్నారు. కార్యక్రమంలో శిక్షణ రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ మున్నూరు రాజు, సెక్టోరియల్ ఆఫీసర్ రజిత, డీఆర్పీలు సుధాకర్ గౌడ్, ఎన్నారం శ్రీనివాస్, ఘనపురం పరమేశ్వర్, రాజ్ కుమార్, శేఖర్, బుర్రి శేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి**

**దుద్యాల్:** ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి అని, ప్రతి రోజు కొత్త విషయం తెలుసుకోవాలని ఉపాధ్యాయ జిల్లా రిసోర్స్ పర్సన్ వీరేశం గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో కొనసాగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వీరేశంగౌడ్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని.. ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయుడే అని గుర్తు చేశారు. అందుకు తగినట్టుగా తరగతి బోధన ఉండాలని సూచించారు. అనంతరం మండల విద్యాధికారి విజయ రామారావు మాట్లాడుతూ విద్యార్థుల ఆసక్తి గుర్తించి వారికి తగిన విధానంలో బోధన చేయాలని.. ఉపాధ్యాయుడి భోదన, భాష విద్యార్థిని ఆకట్టుకునేట్టుగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్ గౌడ్, వెంకటయ్య, సంపత్, శంకరప్ప, అస్మాసుల్తాన, ఆర్షియా బేగం, తేజస్విని, సక్కుబాయి తదితరులు ఉన్నారు.



దుద్యాల్: ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న వీరేశంగౌడ్

### 'ఆపరేషన్ సిందూర్'లో టెర్రరిస్ట్ స్థావరాలు నేలమట్టం

**జిల్లా సైన్స్ అధికారి విశ్వేశ్వర్**

**పూడూరు:** ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్ టెర్రరిస్ట్ స్థావరాలను కూల్చేసిన కల్నర్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ భూమిక ప్రధాన పాత్ర పోషించి విజయవంతం చేయడం జాతికి గర్వకారణమని జిల్లా సైన్స్ అధికారి విశ్వేశ్వర్ అన్నారు. శుక్రవారం మాడల్ స్కూల్‌లో ఉపాధ్యాయ శిక్షణ అనంతరం ఎక్స్ సర్వీస్‌మెన్ గోవర్ధన్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో విద్యార్థులను సాహస నారీమనులుగా తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



ఎక్స్‌సర్వీస్‌మెన్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

### అశ్లీల వీడియో పోస్ట్ చేసిన బాలుడిపై కేసు

**పరిగి:** మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలుడు అశ్లీల వీడియోలను డౌన్‌లోడ్ చేసి తన ఇన్‌స్టాగామ్‌లో పోస్ట్ చేశాడు. ఈ విషయాన్ని గుర్తించిన సైబర్ టిప్‌లెన్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో హైదారాబాద్ అధికారులు జిల్లా పోలీసులకు తెలియజేశారు. వెంటనే అప్రమత్తమైన స్థానిక పోలీసులు గత ఏప్రిల్ 30న కేసు నమోదు చేశాడు.

**అప్రమత్తంగా ఉండాలి..**

**అనంతగిరి:** అశ్లీల వీడియోలు చూసినా, సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ నారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈ తరహా ఘటనలపై చన్గోముల్, పరిగి ఠాణాల్లో కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, ఫోన్లు వాడున్న పిల్లలపై ఓ కన్నేసి ఉంచాలని సూచించారు.

### ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య



నర్సమ్మ(ఫైల్)

**దుద్యాల్:** ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండల పరిధిలోని నాజుఖాన్‌పల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ యాదగిరి తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన బండమీది నర్సమ్మ (50) కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోంది. వాటిని భరించలేని ఆమె పొలం వద్దకు వెళ్లి చీరతో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమారుడు ఆనంద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**కడుపునొప్పి భరించలేక యువతి..**

**యాచారం:** కడుపు నొప్పి భరించలేక ఓ యువతి బలవన్మరణానికి పాల్పడింది. సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని గునుగల్ గ్రామానికి చెందిన రమేశ్, రేణుక కూతురు జాహ్నవి(21) గురువారం సాయంత్రం తీవ్ర కడుపునొప్పితో బాధపడింది ఇది భరించలేని జాహ్నవి అదే రాత్రి ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. శుక్రవారం కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# పరీక్షకు 'ఆధార్' తప్పనిసరి

- కలెక్టర్ ప్రతీక్ జైన్



**అనంతగిరి:** జిల్లాలో ఆదివారం జరగనున్న గ్రామ పాలన అధికారి ఉద్యోగానికి సంబంధించిన పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేశామని, పరీక్ష పకడ్బందీగా నిర్వహిస్తామని కలెక్టర్ ప్రతీక్ జైన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు కింది సూచనలను కచ్చితంగా పాటించాలన్నారు.

- అభ్యర్థులు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని, అందులో వ్యక్తిగత వివరాలు సరిగ్గా ఉన్నాయా లేదా అని చూసుకోవాలి. పరీక్ష కేంద్రం చిరునామాను గుర్తించుకోవాలి.
- అభ్యర్థులు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో పరీక్ష కేంద్రానికి హాజరుకావాలి. వాటిలో ఒక ఫొటోను హాల్ టికెట్‌పై అతికించి నియంత్రణాధికారి(కంట్రోలింగ్ ఆఫీసర్)తో సంతకం చేయించాలి. మరో ఫొటోను పరీక్ష కేంద్రంలో ఇన్విజిలేటర్‌కు ఇవ్వాలి.
- పరీక్ష కేంద్రంలోకి ఫోన్లు, డిజిటల్ వాచ్‌లులు, పెన్‌డ్రైవ్ తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించరు. కావున ఎవరూ తీసుకురాకూడదు.
- అభ్యర్థులు బ్లూ లేదా బ్లాక్ కలర్ బాల్ పాయింట్ పెన్ మాత్రమే తీసుకురావాలి. జెల్ పెన్‌ను ఉపయోగించరాదు.
- పరీక్ష గదిలో అభ్యర్థులు నిశ్శబ్దంగా ఉండాలి. పర్యవేక్షకుల సూచనలు పాటించాలి. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చర్యలు ఉంటాయి.
- అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి నిర్దేశించిన సమయానికి రావాలి: ఉదయం 10:00 గంటలలోపు కేంద్రానికి చేరుకోవాలి. నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించరు.
- ఎంప్లాయ్ గుర్తింపు కార్డ్, ఆధార్ కార్డ్ తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలి.

# దైవ దర్శనానికి వెళ్లి వస్తూ అనంత లోకాలకు

- ఒకరి మృతి, ఏడుగురికి తీవ్ర గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం



ప్రమాదంలో ధ్వంసమైన కారు

**బీబీనగర్:** దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా కారు అదుపు తప్పి బోల్తాపడడంతో ఒకరు మృతి చెందగా.. ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. బీబీనగర్ సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మొయినాబాద్‌కు చెందిన చేగూరి రామస్వామిగౌడ్(60), లక్ష్మి దంపతులు వారి కోడళ్లు భూమిక, మనీషతోపాటు వీరి పిల్లలు అక్షిత్, అక్షయ్, శ్రీయాంక, సహస్రలతో కలిసి గురువారం సాయంత్రం కారులో యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నర్సింహ స్వామి దర్శనానికి వెళ్లారు. శుక్రవారం ఉదయం దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. బీబీనగర్‌కు రాగానే జాతీయ రహదారిపై ఉన్న ఫ్లైఓవర్ సమీపంలో కారు అదుపు తప్పి సర్వీస్ రోడ్డుపైకి పల్టీ కొట్టింది. దీంతో కారు పూర్తిగా ధ్వంసం కాగా.. వాహనంలోని ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను బయటకు తీశారు. నేషనల్ హైవే అంబులెన్స్‌లో వారిని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా రామస్వామి, లక్ష్మితోపాటు, మరొకరి పరిస్థితి విషమంగా ఉందని హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న రామస్వామి మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

# నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనే లక్ష్యం

**తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి**

**తాండూరు:** నియోజకవర్గంలోని ప్రతీ నిరుద్యోగికి ఉద్యోగ కల్పనే లక్ష్యమని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఈ నెల 29న నిర్వహించనున్న మెగా జాబ్ మేళాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తాను ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన ఏడాదిన్నర సమయంలోనే స్థానిక పరిశ్రమల్లో యువత ఉద్యోగాలు కల్పించామన్నారు. జిన్ గుర్తి పారిశ్రామిక వాడ పనులు సైతం వేగంగా కొనసాగతున్నాయన్నారు. తాండూరు నాపరాతి పాలిషింగ్ యూనిట్‌లకు కేంద్రంగా ఉండేదని గత పాలకుల స్వార్థంతో నాపరాతి పరిశ్రమలు కర్ణాటకకు తరలిపోతున్నాయన్నారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 50 కంపెనీలలో 10 వేల ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నామని చెప్పారు. ఈ నెల 29న తాండూరు పట్టణంలోని వినాయక కన్వెన్షన్‌లో ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మేగా ఉద్యోగ జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. రెండు నెలల క్రితం నిర్వహించిన మహిళా జాబ్ మేళా ద్వారా 120 మంది మహిళలు ప్రస్తుతం ఉద్యోగాలు చేస్తున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్లు పట్లోళ్ల బాల్‌రెడ్డి, మాధవరెడ్డి, బీసీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఉత్తమ్‌చంద్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు హబీబ్‌లాల, మండలాల అధ్యక్షులు నర్సింహులు, గోపాల్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, మాజీ కౌన్సిలర్లు, నాయకులు తదితరులున్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బీఎంఆర్, నాయకులు

**భూ బాధితులకు పరిహారం**

తాండూరు పట్టణ శివారులో నర్సింగ్ కళాశాల నిర్మాణంలో భూమి కోల్పోయిన ఇద్దరు మహిళా రైతులకు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి నష్ట పరిహారం అందించారు. బషీర్‌మియా తండాకు చెందిన కేతావత్ మల్కిబాయి, కేరిబాయిలకు సర్వేనెంబర్ 52/7లో మూడు ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని ప్రభుత్వం నర్సింగ్ కళాశాల నిర్మాణం కోసం స్వాధీనం చేసుకొంది. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో వారికి రూ.54 లక్షల పరిహారం చెక్కులను అందజేశారు.